
సాక్షి ఒడిశా

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,69,437లు, బంగారం 14.93 మిల్లీగ్రాములు, వెండి 33.3 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఎమ్మెల్యే ప్రదీప్‌కు ఎదురుదెబ్బ

- 8లో



విద్యార్థులతో కాసేపు..

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి ప్రభుత్వ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో రాయగడ సబ్ కలెక్టర్ భీమసేన సాబోరో పర్యటించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

తప్తపాణి ఘాటీలో ట్రక్కు బోల్తా



లోయలో బోల్తా పడి ఉన్న కలప ట్రక్కు

బరంపురం: జిల్లాలోని పట్టపూర్ పోలీసు స్టేషన్ పరిధి తప్తపాణి ఘాటీలో కలప దుంగల లోడుతో వస్తున్న ట్రక్కు అదుపు తప్పి, 50 అడుగుల లోయలో పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ట్రక్కులో చిక్కుకున్న డ్రైవర్, క్లీనర్‌ను రక్షించారు. ఇరువురూ గాయాల పాలవ్వడంతో దిగపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ సవ్యసాచి మల్లిక్ తెలిపారు.

20 లక్షల వాహనాలు తుక్కు లోకి!

భువనేశ్వర్: రోడ్లపై రవాణాకు పట్టు కోల్పోయి, 15 ఏళ్లు పైబడిన 20 లక్షలకు పైగా వాహనాలను రద్దు చేయనున్నారు. రాష్ట్ర వాణిజ్య, రవాణాశాఖ మంత్రి టుకుని సాహు అసెంబ్లీలో ఈ విషయాన్ని వెల్లడించారు. రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ పాలసీ-2022 ప్రకారం, వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి 20 లక్షలకు పైగా వాహనాలను దశల వారీగా రోడ్ల నుంచి తొలగిస్తామన్నారు. 15 ఏళ్లకు పైగా రవాణాలో ఉపయోగిస్తూ.. పట్టు కోల్పోయిన 20,39,500 వాహనాలను గుర్తించామన్నారు. రద్దు చేయనున్న వాహనాల్లో 12,99,351 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని తెలిపారు. దీనికి సంబంధించి స్క్రాపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. డొక్కు వాహనాలు రద్దు చేయడంతో వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం స్క్రాపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పాలసీ మార్గదర్శకాల ప్రకారం పాత వాహనాల యజమానులు కొత్త వాహనాలను కొనుగోలు చేయడానికి ప్రోత్సాహకాలు కూడా పొందుతారని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

24 కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంపీవీ-21 గ్రామం వద్ద ఎక్సైజ్ విభాగం పోలీసులు శుక్రవారం పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో బేజంగ్‌వాడ వైపు నుంచి బైక్‌పై అతి వేగంగా వస్తున్న నారాయణ గొలారిను అడ్డుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 24కిలోల గంజాయి పట్టుబడింది. సరుకును స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు కలిమెల సమితి లోని కొర్కుటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతనిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన గిరిధర్ గమాంగ్



మాట్లాడుతున్న గిరిధర్ గమాంగ్

కొరాపుట్: తెలంగాణా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము బీఆర్ఎస్ పార్టీ చేరిన సందర్భంలో కొరాపుట్ జిల్లాల సమస్యలను పార్టీ అధ్యక్షుడైన కేసీఆర్‌కు తెలియజేశామన్నారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి, చర్యలు తీసుకున్నారన్నారు. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి, ఈ ప్రాంతానికి తెలంగాణా నుంచి ఆర్‌టీసీ బస్సులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ సర్వీసుల రాకతో రాయగడ, కొరాపుట్, నవరంగ్‌పూర్, మల్కన్‌గిరి, కలహండి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయని ఆనందం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేతకు ఒడిశా బీఆర్ఎస్ విభాగం తరువున కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే జయపురానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రవీంద్ర మహాపాత్రొ హర్షం వ్యక్తంచేశారు.





స్పీకర్‌కు అభివాదం చేస్తున్న సీఎం, సభ్యులు (ఇన్‌సెట్లో) ట్యాబ్‌లో బడ్జెట్ చదివి వినిపిస్తున్న ఆర్థికమంత్రి



రాష్ట్ర శాసనసభలో 2023-24 ఆర్థిక సంవత్సర పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిరంజన్ పూజారి శుక్రవారం ప్రవేశ పెట్టారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఐదో విడత పాలనలో ఇది చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెటు కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రూ.2,30,000 కోట్ల అంచనాతో ఆర్థికమంత్రి బడ్జెట్‌ను సమర్పించారు. 2022-23లో ప్రవేశ పెట్టిన రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కంటే ఇది దాదాపు 15శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇందులో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. - భువనేశ్వర్

ఆరోగ్యమస్తు..!

- అసెంబ్లీలో 2023-24 బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి నిరంజన పూజారి
- సకల జనుల హితమే లక్ష్యమని వెల్లడి
- గతంతో పోల్చితే ఆరోగ్య రంగానికి 27శాతం పెరిగిన కేటాయింపులు
- వ్యవసాయానికి రూ.24,829 కోట్లు, విద్యకు రూ.30,030 కోట్లు

'మానవ వనరుల అభివృద్ధి, భౌతిక, సామాజిక, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, అందరికీ ఆరోగ్యం, వెనుకబడిన, బలహీన వర్గాలకు సామాజిక భద్రత, యువజన సాధికారత ద్వారా వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించడంపై తాజా బడ్జెట్ దృష్టి కేంద్రీకరించింద'ని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి నిరంజన పూజారి ప్రకటించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఆయన అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రకటించారు. ఈ ఏడాది ఈ రంగానికి సమగ్రంగా రూ.24,829 కోట్లు కేటాయించారు. వ్యవసాయోత్పత్తిని పెంచడం, రైతులకు సాగు సహాయం, నీటిపారుదల వంటి వాటిపై ఈ బడ్జెట్ దృష్టి సారించడం విశేషం. ప్రజాకర్షిత ప్రభుత్వ పథాకలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారు. కాలియా యోజన కోసం రూ.1,879 కోట్లు, ఉద్యానవన అభివృద్ధికి రూ.381 కోట్లు, వ్యవసాయ సాంకేతిక విశ్వ విద్యాలయం(ఓయూఏటీ) వ్యవసాయ పరిశోధనలకు రూ.166 కోట్లు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహకం కింద ఛొత్తు(పుట్ట గొడుగులు) మిషన్, పూలసాగుకు రూ.100 కోట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మిల్లెట్ మిషన్ అమలు చేయనున్నారు. దీనికోసం రూ.497 కోట్లు ప్రకటించారు.

రూ.275 కోట్లతో పైలెట్ శిక్షణ కేంద్రం

రాష్ట్రప్రభుత్వం పైలెట్ శిక్షణ రంగానికి ప్రాధాన్యత కల్పించింది. ఢెంకనాల్ జిల్లా బిరసల్ బిజూ పట్నాయక్ ఏరోస్పేస్ అకాడమీ అంచెలంచెలుగా ప్రపంచ శ్రేణి పైలట్ శిక్షణా కేంద్రంగా ఎదుగుతుందని ఆర్థికశాఖ మంత్రి ప్రకటించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.275 కోట్లు కేటాయించారు. దశలవారీగా ఈ కేంద్రం నుంచి ఏటా 500 మందికి ఉన్నత శిక్షణతలో పైలెట్‌లుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పేర్కొన్నారు.

పూరీ విమానాశ్రయానికి నిధులు..

పూరీలో గ్రీన్‌ఫీల్డ్ జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం, కొరాపుట్ జిల్లా జయపురం విమానాశ్రయం, కలహండిలో ఉత్కెలా, గంజాంలో రంగేలుండా, మల్కన్‌గిరి ఎయిర్‌స్ట్రిప్‌ల పునరుద్ధరణ, విస్తరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఆర్థిక వ్యవస్థ జీవనాధారంగా వెలుగొందుతున్న విద్యుత్‌రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. 2000-01లో విద్యుత్ రంగం బడ్జెట్ కేటాయింపులు రూ.306 కోట్లకు పరిమితం కాగా.. 2023-24 బడ్జెట్‌లో ఈ రంగానికి అత్యధికంగా రూ.3,003 కోట్లకు పెంచారు.

రాబడి ఇలా..

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయ వనరుల కింద రూ.53 వేల కోట్లు
- పన్నుయేతర వనరులు రూ.52,500 కోట్లు
- ఆదాయపు పన్ను వంటి కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటా రూ.46,251 కోట్లు
- కేంద్ర గ్రాంట్లు కింద రూ.32,749 కోట్లు ఆర్థిక వనరులుగా బడ్జెట్ ప్రణాళికలో పేర్కొన్నారు.

వివిధ శాఖలకు కేటాయింపులివీ..

- ఆరోగ్య రంగానికి 2022-23తో పోలిస్తే 27శాతం కేటాయింపులు పెరిగి, రూ.16 వేల కోట్లు దాటింది.
- క్రీడలు, రోడ్లు-వంతెనలు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి 34శాతం అదనపు నిధులు పెంపొందించారు.
- క్రీడా రంగానికి రూ.19,452 కోట్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,217 కోట్లు, విద్య, నైపుణ్యాభివృద్ధికి రూ.30,030 కోట్లు, మిషన్‌శక్తికి రూ.6,224 కోట్లను ప్రకటించారు.
- 16 కొత్త ఇన్‌స్ట్రీమ్ స్టోరేజీ ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.854 కోట్లు, పార్వతిగిరి మెగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు.
- 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి లక్ష అదనపు లోతైన బోరుబావుల ఏర్పాటుకు కొత్త బడ్జెట్‌లో రూ.4,198 కోట్లు.
- బిజూ కృషక్ వికాస్ యోజన కింద 1500 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.400 కోట్లు.
- మొరాయిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పునరుద్ధరణకు రూ.191 కోట్లు కేటాయించారు.
- రెండో విడత బిజూ ఎక్స్‌ప్రెస్‌వే పనుల్లో భాగంగా బరంపురం నుంచి జయపురం వరకు 335 కిలోమీటర్ల మేర 4 లైన్ల రహదారి అనుసంధాన పనులు చేపడతారు. దీని కోసం బడ్జెట్‌లో రూ.6,100 కోట్ల నిధులు కేటాయించారు.
- ప్రభుత్వ కార్యక్రమాలకు వన్నెదిద్దిన బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన(బీఎస్‌కేవై)కు రూ.2,80 కోట్లు.
- రూ.1కే కిలో బియ్యం పథకానికి రూ.1,035 కోట్లు.
- వసుధకు రూ.4,750 కోట్లు.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా జీ(పీఎంఏవై-జీ)కి రూ.5,934 కోట్లు.
- మో స్కూల్ అభియాన్‌కు రూ.805 కోట్లు
- వరి సేకరణకు రూ.2 వేల కోట్లతో రివాల్వింగ్ ఫండ్
- విద్యా రంగంలో మేధావంతుల ప్రోత్సాహానికి రూ.139 కోట్లు.
- ముఖ్యమంత్రి కొత్తగా ప్రవేశ పెట్టిన జనజాతి ఉపాధి మిషన్‌కు రూ.120 కోట్లు.
- ముఖ్యమంత్రి కెందు(తునికా) ఆకుల సంక్షేమ నిధికి రూ. 50 కోట్లు.
- పూరీ హెరిటేజ్(వారసత్వ) సిటీగా అభివృద్ధి చేసేందుకు ఒబొధా పథకం కింద బడ్జెట్‌లో రూ.224 కోట్లు.



సీఎం నవీన్ పట్నాయక్‌కు పెన్‌డ్రైవ్‌లో 2023-24 బడ్జెట్‌ను అందిస్తున్న ఆర్థికశాఖ మంత్రి నిరంజన పూజారి

హరిత ఉద్యమం..

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో హరిత ఉద్యమం బలోపేతం అవుతుంది. కాగిత రహిత దస్తావేజులతో బడ్జెట్ కార్యకలాపాలు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమగ్ర సమాచారం అరచేతిలో ఇమిడిపోయే బుల్లి పెన్‌డ్రైవ్‌లో పదిలపరచిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి నిరంజన పూజారి.. శుక్రవారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో బడ్జెట్ సమగ్ర వివరాలను ట్యాబ్‌లో ప్రదర్శించి సభకు సమర్పించారు. రాష్ట్ర పౌరులకు బడ్జెట్ పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రకటించారు. ఈ చర్య పట్ల సీఎం నవీన్ ఆర్థికశాఖ మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల బడ్జెట్..

శాసనసభలో ఈ ఏడాది ఎన్నికల బడ్జెట్ ప్రవేశ పెట్టారని ప్రతిపక్ష నేత జయనారాయణ మిశ్రా వ్యాఖ్యానించారు. ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా 2024లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని ఆరోపించారు. ఓటర్లే లక్ష్యంగా ప్రభుత్వం కేటాయింపులను సర్దుబాటు చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మాత్రం పెద్దగా కేటాయింపు లేవని పెదవి విరిచారు.

\- నారాయణ మిశ్రా, ప్రతిపక్ష నేత

ప్రజా బడ్జెట్..

రాష్ట్ర కొత్త బడ్జెట్ ప్రజల బడ్జెట్ అని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభివర్ణించారు. ఈ బడ్జెట్ ప్రజల కోసం ప్రజలతో ప్రజలే రూపుదిద్దుకున్న బడ్జెటుగా అభివర్ణించారు. ఈ బడ్జెట్ రాష్ట్రానికి కొత్త శిఖరాల అధిరోహణకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

\- సీఎం నవీన్ పట్నాయక్

సంగీత కళాకారులకు సత్కారం



సంగీత దర్శకులు లక్ష్మీనారాయణ పాటిల్‌ను సన్మానిస్తున్న తిరుపతి పాణిగ్రాహి

- హైటెక్ మెడికల్‌లో సంగీత ప్రీమియర్ లీగ్ ప్రారంభం

పర్లాకిమిడి: ఒడిశా సంగీత ప్రీమియర్ లీగ్ 8వ సీజన్‌ను భువనేశ్వర్‌లోని హైటెక్ మెడికల్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని హైటెక్ గ్రూప్స్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన సినీ గాయనీ, గాయకులు, కళాకారులు తమ ప్రదర్శనలతో అబ్బుర పరిచారు. ఒలీవుడ్ పాటల రచయిత అరుణ్ మంత్రి, ప్లేబ్యాక్ సింగర్ బిబుదాస్, సినీనటి షాలినా రే, జిత్తు మంగరాజ్ పాల్గొన్నారు. అనంతరం ఒడియా చలనచిత్ర రంగంలో గత 2 దశాబ్దాలుగా తన సంగీతంతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న సంగీత దర్శకులు లక్ష్మీనారాయణ పాటిల్, షాలినా రే తదితరులను తిరుపతి పాణిగ్రాహి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజశాఖ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్‌చంద్ర జెన్నా, హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్లు సురేష్ పాణిగ్రాహి, రూపేష్ పాణిగ్రాహి, డాక్టర్ రాకేష్ పాణిగ్రాహిలు పాల్గొన్నారు.

జగన్నాథ మందిరాన్ని సందర్శించిన కౌన్సిల్ సభ్యులు



జగన్నాథ మందిరం సందర్శనలో చైర్మన్ మహంతి, ఈఓ, సభ్యులు

కొరాపుట్: జయపురం పట్టణంలోని జగన్నాథ మందిరాన్ని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు శుక్రవారం సందర్శించారు. మందిర అభివృద్ధి నిమిత్తం ఇటీవల రాష్ట్ర 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ కమిటీ విన్నవించింది. అనంతరం బీజేడీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్‌దాస్(బబి దాస్) సైతం పరిశీలించారు. ఈ నేపథ్యంలో మందిరం పూర్తి వివరాలతో నివేదిక అందించాలని 5టీ కార్యాలయం నుంచి కొరాపుట్ కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తార్‌కు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు జయపురం మున్సిపల్ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ కౌన్సిల్‌తో కలిసి మందిరాన్ని సందర్శించి, వివరాలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఈఓ, మున్సిపల్ చైర్మన్ నోరి మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మాజీ వైస్ చైర్మన్ మున్నా రథొ, కౌన్సిలర్లు జగన్నాథ మందిరంతో పాటు సమీపంలోని వల్లభ నారాయణ, భగవతి మందిరాలను సందర్శించారు. నిర్వహక కమిటీలతో సమావేశమయ్యారు. వాటి అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్చలపై చర్చించారు.

తల్లీ కొడుకులకు 6నెలలు జైలు

- పోలీసులపై దాడి కేసులో శిక్ష విధించిన కోర్టు

రాయగడ: పోలీసులపై ఆక్రమణ కేసుకు సంబంధించి గుణుపూర్ సబ్ డివిజనల్ జ్యుడీషియల్ కోర్టు(ఎస్‌డీజేఎం) తల్లీ, కొడుకులకు 6నెలల జైలుశిక్ష విధించింది. ఎస్‌డీజేఎం శాంతశ్రీ మహంతి ఈ మేరకు తీర్పు వెలువరించారు. సాక్షాలను విచారించిన అనంతరం తీర్పును ఆమె ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే.. గుణుపూర్ లోని గాంధీనగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అదే కాలనీలో నివసిస్తున్న లక్ష్మీ లిమా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసుల పైనే లక్ష్మీ ఆమె కుమారుడు అనీల్ దాడి చేశారు. ఈ నేపథ్యంలో 2021 జనవరి 8న చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో గుణుపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం తుది విచారణకు వచ్చిన ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను పరిశీలించి, తీర్పును వెలువరించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమాశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పండా

పర్లాకిమిడి: జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమావేశం డీఆర్‌సీఎస్ చైర్మన్, కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కోవిడ్-19 నేపథ్యంలో గత మూడేళ్లు సమావేశాలు నిలిచిపోగా, ఎట్టకేలకు ముందడుగు వేయడం గమనార్హం. సమావేశానికి వైస్ చైర్మన్, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, ముఖ్య కార్యనిర్వాహణాధికారి, డీఆర్‌డీఏ రమాంచల్ ఖమారి హాజరయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ నిధులు సమకూర్చేందుకు సభ్యులు, జీవితకాల సభ్యుల సంఖ్య పెంచాలని తీర్మానించారు. జిల్లా ఆర్టీఓ అధికారి, డిప్యూటీ కలెక్టర్ నట్వర గరోడో, ఆర్అండ్‌బీ బ్లాక్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టుల చేతిలో ఇన్‌ఫార్మర్ హత్య



మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన చందన్‌మాలిక్ మృతదేహం

కొరాపుట్: మావోయిస్టుల చేతిలో ఇన్‌ఫార్మర్ హత్యకు గురయ్యాడు. నవరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి హత్తిగాం గ్రామం సమీపంలో చందన్ మాలిక్(36) మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. గురువారం రాత్రి చందన్‌ను మావోయిస్టులు ఎత్తుకుపోయారు. ఉదయమే అతను శవమై తేలాడు. ఘటనా స్థలంలో మావోయిస్టులు కొన్ని కరపత్రాలు వెదజల్లారు. చాలాకాలంగా చందన్ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని, తాము ఎన్నిసార్లు హెచ్చరించినా వినలేదని తెలిపారు. ఎవరైనా పోలీసులకు తమ సమాచారం అందిస్తే ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. శుక్రవారం సాయంత్రం వరకు భద్రతా దళాలు ఆ ప్రాంతానికి అక్కడికి చేరుకోలేదు.

253 యూనిట్ల రక్తం సేకరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బేగ్, పక్కన ఏడీఎం బెహరా

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి ఉత్కళ అలూమిన కర్మాగారం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కర్మాగారంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొని, స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్లడ్‌బ్యాంక్ అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 253 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు కర్మాగారం అధికారులు శుక్రవారం తెలిపారు. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా ముఖ్య అతిథిగా హాజరు కాగా.. కర్మాగారం యూనిట్ విభాగాధిపతి మజూర్ బేగ్, సీఎస్ఆర్ హెడ్ లోపముద్ర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కర్మాగారం సిబ్బంది

ఈ సందర్భంగా ఏడీఎం బెహరా మాట్లాడుతూ రక్తదానం మహత్తర దానమన్నారు. ఇది ఎంతోమందికి సంజీవనిలా ఉపయోగ పడుతుందని తెలిపారు. శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసిన వారిని ఆయన అభినందించారు.

క్లుప్తంగా

వేగవంతంగా ఆర్‌అండ్‌ఆర్ పనులు

● జేసీ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కింద పునరావాస పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. ఆర్‌అండ్‌ఆర్ పనులపై రెవెన్యూ, కార్యనిర్వాహణ శాఖలతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీలలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉండరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, ఆర్‌డీఓ కె.హేమలత, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు శాంతీశ్వరరావు, జేమ్స్, ప్రభాకరరావుతో పాటు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

రికార్డు అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్

పార్వతీపురం టౌన్: విజయనగరం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎంఎల్ఎస్‌సీ విభాగంలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన రికార్డు అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, విజయనగరం వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి చదివి 18 సంవత్సరాల నుండి 42 సంవత్సరాల వయస్సు కలిగిన దృష్టి లోపం గల మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

27న మీ వద్దకే పీఎఫ్

విజయనగరం టౌన్: పీఎఫ్ ఖాతాదారులకు, పెన్షనర్లకు, పీఎఫ్ సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యలపై ఈ నెల 27న మీ వద్దకే పీఎఫ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అబ్దుల్ ఖాదర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విజయనగరంలో హిమగిరి థియేటర్ పక్కన ఎస్పీ బంగ్లా సమీపంలో ఉన్న ఈపీఎఫ్ఓ కార్యాలయంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పీఎఫ్ సమస్యలు ఉన్న వారందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు యశ్వంత్

● ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ



బొమ్మి యశ్వంత్

తెర్లాం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న అండర్ - 14 విభాగంలో జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు తెర్లాం మండలం కూనాయవలసకు చెందిన బొమ్మి యశ్వంత్ ఎంపికయ్యాడు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ బాలబాలికల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో రాష్ట్రం తరఫున నలుగురు క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అందులో యశ్వంత్ ఒకరు. ఏప్రిల్, మే నెలలో ఈ పోటీలు జరగనున్నాయి. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న యశ్వంత్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, తోటి విద్యార్థులు, క్రీడాకారులు అభినందించారు.

పులి పంజా



పులి దాడిలో మృతి చెందిన ఆవు

మెంటాడ: మండలంలోని మల్లేడవలస గ్రామంలో గురువారం రాత్రి బొండపల్లి మురళి, మల్లేడ లక్ష్మీలకు చెందిన రెండు ఆవులను బెంగాల్ టైగర్ దాడి చేసి చంపినట్లు అటవీ శాఖ మెంటాడ రేంజ్ అధికారి కెవిఎన్.రాజు తెలిపారు. శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన ఆవులను పరిశీలన చేశారు. ఆవులపై పులి దాడి వాస్తవమేనన్నారు. పులి సంచారంపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. స్థానికులు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, చీకటి పడిన తరువాత ఇళ్ల నుండి ఆరుబయటకు వెళ్లవద్దని సూచించారు.

ఇద్దరికి గాయాలు

దత్తిరాజేరు: బస్సు ఢీకొని, ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని ఇంగిలాపల్లి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెంటాడ మండలంలోని జయతి గ్రామం నుంచి పల్లరాము, టి.సత్యం బైక్‌పై వెళ్తుండగా, గజపతినగరం నుంచి జక్కువ వెళ్తున్న ఓ పల్లె వెలుగు బస్సు వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో కింద పడిన వారు గాయాలపాలయ్యారు. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి, నిమిత్తం గజపతినగరం సామాజిక ఆస్పత్రికి వారిని తరలించారు.

దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది

● కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ విమర్శలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడమ్

రాయగడ: బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని, వారి అవినీతి పాలన కారణంగా దేశ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ విమర్శించారు. పట్టణంలోని ప్రజాపనుల శాఖ ఐబీలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో గత 8ఏళ్ల పాలనలో దేశం ఎటువంటి అభివృద్ధి చెందలేదన్నారు. వ్యాపార వేత్తలైన అంబానీ, ఆదానీ గుప్పెట్లో కేంద్రం కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలపై ఆర్థికభారం పడుతోందన్నారు. బ్యాంకులు, ఎల్ఐసీ వంటి సంస్థల నుంచి వేల కోట్ల రూపాయలను కార్పొరేటర్లకు రుణాల కింద మంజూరు చేస్తూ ప్రజాధనాన్ని దోచి పెడుతున్నారని దుయ్యబట్టారు. కేంద్రప్రభుత్వ విచ్ఛిన్నకర నిర్ణయాలకు అడ్డుకట్ట వేసేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, ఉపాధ్యక్షుడు శంకర్షన మంగరాజ్, అప్పలస్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతోనే విజయం సొంతం



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న ఫ్రెంచ్ గ్రూపు ఏడీపీ చైర్మన్, ఆగస్టిన్ డి.రోమానెట్

రాజాం సిటీ: పట్టుదలతోనే విజయాలు సాధ్యమవుతాయని, అందుకు నిదర్శనం గ్రంథి మల్లిఖార్జునరావేనని పారిస్‌కు చెందిన గ్రూపు ఏడీపీ చైర్మన్, సీఈఓ ఆగస్టిన్ డి.రోమానెట్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన జీఎంఆర్ ఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వృత్తిపరమైన, వ్యక్తిగత విజయాలను నిర్మించడంలో జీఎంఆర్ ఐటీ ఓ గొప్ప సంస్థ అని పేర్కొన్నారు. ప్రజల కలలను నెరవేర్చడానికి జీఎంఆర్‌వీఎఫ్ కృషి ప్రశంసనీయమన్నారు. జీఎంఆర్ గ్రూపుతో వ్యాపార ఒప్పందంలో భాగంగా ఫ్రెంచ్ కంపెనీ గ్రూపు ఏడీపీ పెట్టుబడులు పెట్టిందని, జీఎంఆర్ సంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యం కోసం చూస్తున్నామన్నారు. పని, దృష్టి, పుస్తకాలు, జ్ఞానం కోసం ఇంటర్నెట్, సమాజానికి సహకారం–ఆశయం, కలలతో పాటు మంచి వ్యక్తులతో చెలిమి వంటి విషయాలను అలవర్చుకుంటే సంతోషంతో పాటు భావోద్వేగాల నియంత్రణకు ఉపయోగపడుతుందన్నారు. ఆగస్టీన్ డి.రొమానెట్ పేరిట స్కాలర్‌షిప్‌లు, అవార్డులు ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పారిస్‌లో జీఎంఆర్ ఐటీ విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్‌లు ప్రకటించారు. అనంతరం పారిశ్రామిక వేత్త గ్రంథి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ జీఎంఆర్ వీఎఫ్ ఏర్పాటు, ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. సమాజానికి సేవ చేయడంతోపాటు మంచి విద్య, వైద్యం అందించడమే జీఎంఆర్ వీఎఫ్ లక్ష్యమని, దీనిలో భాగంగా 'గిఫ్టెడ్ చిల్డ్రన్' కార్యక్రమం ఒకటని, ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారులను దత్తత తీసుకుని, జీఎంఆర్‌వీఎఫ్ ద్వారా చదివిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 2500 మందిని దత్తత తీసుకుని వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు వచ్చే వరకు సహకారం అందించడం సంతృప్తినిచ్చిందన్నారు. శుక్రవారం మరో పది మంది పిల్లలను దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పంట పొలాల్లో గజరాజులు



భామిని: లివిరి వ్యవసాయ క్షేత్రంలో ప్రవేశించిన ఏనుగుల గుంపు

భామిని:

మండలంలోని లివిరిలో నాలుగు ఏనుగుల గుంపు శుక్రవారం ఆకస్మాత్తుగా పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేశాయి. సోమరాజు గోపాలరావుకు చెందిన లివిరి వ్యవసాయ క్షేత్రంలో ఏనుగులు చొరబడి మొక్కజొన్న, పామాయిల్, కొబ్బరితోటలను ధ్వంసం చేశాయి. కొద్ది రోజులుగా పసుకుడిలో తిష్ట వేసిన ఏనుగులు ఆకస్మాత్తుగా రూటు మార్చి వంశధార నదీ తీరం వెంబడి ప్రయాణించి లివిరి పంట పొలాల్లోకి ప్రవేశించాయి. పంట నష్టాలను అంచనా వేసి అధికారులు ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఇంకా కదలని ఏనుగులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి - నడుకూరు ప్రాంతంలోని పంట పొలాల వైపు వచ్చిన ఏనుగులు ఇంకా కదలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి కిమ్మి - నడుకూరు రోడ్డు పైకి ఏనుగులు రావడంతో ఈ రోడ్డులో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోయాయి. పగలంతా ఎండ వేడిమికి చెరుకు తోటలో తిష్ట వేస్తున్న ఏనుగులు సాయంత్రం వాతావరణం చల్లబడే సరికి రోడ్లపైకి పక్కనే ఉన్న పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగులను ఇతర ప్రాంతాల వైపు మళ్లించేందుకు కొందరు వ్యక్తులు పొలాల్లో గడ్డి కుప్పలకు, చెరుకు తోటలకు నిప్పు పెడుతుండడంతో ఏనుగులు ఎటూ వెళ్లకుండా ఇక్కడే తిష్ట వేస్తున్నాయని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు ఏనుగుల గుంపు నుండి విడిపోయిన ఒంటరి ఏనుగు హరి వస్తేగాని ఇక్కడి నుండి ఇవి కదిలే పరిస్థితి లేదని డీఆర్‌ఓ రవిబాబు పేర్కొన్నారు. అంతవరకు ఏనుగులను ఎవరూ కవ్వించవద్దని కోరారు.

చోరీ కేసు నిందితుడి అరెస్ట్

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు దిగువ వీధి రామమందిరం హుండీలో నగదు చోరీకి పాల్పడిన నిందితుడు ద్వారపురెడ్డి రాంబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.రాజేష్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మందిరంలోకి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, హుండీని పగలగొట్టి, అందులో ఉన్న నగదు తీసుకుని పరారైనట్లు ఫిర్యాదు అందిందని, దీనిపై దర్యాప్తు చేస్తే అదే గ్రామానికి చెందిన వ్యక్తిని పట్టుకున్నామన్నారు. అనంతరం అతడి వద్ద నుంచి కొంత నగదు, చోరీకి వినియోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిని పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: రైలు ఢీకొని, ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం నగరంలోని రైల్వేస్టేషన్ దగ్గర చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భువనేశ్వర్ నుంచి రామేశ్వరం వెళ్తున్న విజయనగరం ఎక్స్‌ప్రెస్ రైలు రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం..కి వస్తుండగా, 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి రైల్వే ట్రాక్ దాటేందుకు ప్రయత్నించగా, ప్రమాదవశాత్తు ఆ రైలు ఢీకొని, అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్లు 9666555214, 9490617089 సంప్రదించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ప్రదీప్‌కు ఎదురుదెబ్బ

● అవినీతి కేసులో స్టేపై హైకోర్టు ఆదేశాలను కొట్టివేసిన సుప్రీంకోర్టు



భువనేశ్వర్: గంజాం జిల్లా గోపాల్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టరు ప్రదీప్‌కుమార్ పాణిగ్రాహికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విజిలెన్స్ విచారణకు లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం తోసి పుచ్చడంతో ఈ పరిస్థితి నెలకొంది. 2020 డిసెంబర్ 11న ప్రదీప్ పాణిగ్రాహిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి, 2 నెలల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర లోకాయుక్త విజిలెన్స్ డైరెక్టరేట్‌ను ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేసిన ఆయన.. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. పాక్షిక-న్యాయపరమైన విచారణలో ఫిర్యాదుదారుడు (రాష్ట్ర విజిలెన్స్) పరిశోధకుడిగా ఉండరాదని పేర్కొంటూ న్యాయస్థానం 2021 ఫిబ్రవరి 3న రాష్ట్ర లోకాయుక్త ఆదేశాలను తోసిపుచ్చింది. ప్రాథమిక విచారణకు ముందు, రాష్ట్ర విజిలెన్స్ రహస్య ధ్రువీకరణ ద్వారా పాణిగ్రాహి వ్యతిరేకంగా అవినీతికి సంబంధించిన సాక్ష్యాలను కనుగొన్నట్లు లోకాయుక్త చేసిన ప్రకటన పట్ల హైకోర్టు పెదవి విరిచింది.

ఉద్యోగాల పేరుతో మోసం..

రాష్ట్ర లోకాయుక్త ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి సిఫార్సు మేరకు విచారణ కోసం దాఖలు చేసిన తొలి అవినీతి ఆరోపణల కేసు ఇదే కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సైబర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి క్రైమ్ బ్రాంచ్ 2020 సెప్టెంబర్ 3న ఎమ్మెల్యే పాణిగ్రాహిని అరెస్ట్ చేసింది. ఐపీసీ సెక్షన్ 419, 420, 467, 468, 469, 471, 120-బీ, ఐటీ చట్టంలోని సెక్షన్ 66సీ/66డీ సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు. టాటా మోటార్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఆకాష్‌కుమార్ పాఠక్(సస్పెండ్‌కు గురైన ఐఎఫ్ఎస్ అధికారి అభయ్‌కాంత్ పాఠక్ కుమారుడు) తరఫున డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు కలకలం రేపాయి. ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడి, సస్పెండ్ అయిన ఐఎఫ్ఎస్ అధికారి అభయ్‌పాఠక్ కుమారుడు ఆకాష్ పాఠక్ తరఫున పాణిగ్రాహి అమాయక వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఆకాష్ వేషధారణ, మోసం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర, ఇతర సైబర్ నేరాలకు సంబంధించిన కేసును క్రైం బ్రాంచ్ గతంలో పేర్కొంది.

టీటీడీ ఆర్థికసాయంతో శివాలయ నిర్మాణం

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ, బొడారపువలస గిరిజన గ్రామ పొలిమేరల్లో టీటీడీ ఆర్థికసాయంతో శివాలయం నిర్మిస్తున్నట్లు హిందూ పరిషత్ సమరత సేవా సంఘం కన్వీనర్ పతివాడ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఓ చిన్న కొండపై ఆలయ నిర్మాణం చేస్తూ పరిసరాలు శుభ్రం చేస్తుండగా శ్రీరాముని పాదముద్ర బయటపడింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో దాదాపు రూ.18 లక్షల వ్యయంతో ఆలయం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

'తోటపల్లి' పనులు వేగవంతం చేయండి

● ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో నీరందించాలి
● ఎడమ కాలువ పనులు పరిశీలించిన చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు



ప్రస్తుతం జరుగుతున్న తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులపై వివరాలు అడుగుతున్న చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు

వీరఘట్టం:

పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లా రైతుల ఆశల సౌధం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న పాత ఆయకట్టు కాలువల ఆధునీకీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలని జల వనరుల శాఖ ఉత్తరాంధ్ర జిల్లాల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టు నుండి వీరఘట్టం మండలం ఎం.రాజపురం వరకు ఎడమ కాలువలో జరుగుతున్న ఆధునీకీకరణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సకాలంలో నీరందించేలా పనులను చేపట్టాలని సూచించారు. కుడి, ఎడమ కాలువలో ఉన్న బ్రిడ్జిలు, సూయిజ్ కాలువలు త్వరగా నిర్మించాలని తెలిపారు. పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం స్థానంలో అక్విడేట్ నిర్మించేందుకు డిజైన్ యొక్క డ్రాయింగ్‌ను తక్షణమే పంపించాలని సూచించారు. అన్ని డిస్ట్రిబ్యూటరీ చానళ్ల వద్ద షట్టర్లను మరమ్మతులు చేయించాలని తెలిపారు. రూ.193 కోట్లతో చేపడుతున్న తోటపల్లి ఆధునికీకరణ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేస్తోందని, ప్రభుత్వం, రైతులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుని కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో నీరిందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ పనులకు అనుకూలంగా ఉన్నందున నిరాటంకంగా పనులు చేపట్టాలే అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇంత వరకు చేపట్టిన పనుల వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జల వనరుల శాఖ ఎస్ఈ పి.సుధాకరరావు, డీఈఈ దమలపాటి రవికుమార్, ఏఈలు బి.శంకరరావు, డీవీ రమణ, కాంట్రాక్టర్ మోహన్‌బాబు, శ్రీకాంత్ ఉన్నారు.

తక్షణమే రక్షణ గోడ నిర్మించాలి

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ హెడ్ వద్ద రక్షణ గోడను తక్షణమే నిర్మించాలని నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు పాత ఎడమ, కుడి కాలువ లైనింగ్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న ఖరీఫ్ ప్రారంభం నాటికి మొత్తం లైనింగ్ పనులు పూర్తి కావాలన్నారు. జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి దగ్గర సైఫాన్ పనులకు సంబంధించి డ్రాయింగ్ మరియు డిజైన్‌ను తక్షణమే పంపించాలన్నారు. బ్రిడ్జిలను మరియు సూపర్ పాసేజ్‌లను త్వరగా నిర్మించాలని ఆదేశించారు. ఎడమ, కుడి కాలువ షట్టర్లను తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. తోటపల్లి, పెదబుడ్డిడి, రాజపురం, కత్తుల కవిటి, హుస్సేన్‌పురం దగ్గర జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పర్యవేక్షక ఇంజినీర్ పి.సుధాకర్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ బి.శంకరరావు, డివి.రమణ తదితరులున్నారు.

మన్యంలో ఆర్టీసీకి కొత్త కళ



● ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుకు చర్యలు
● ప్రయాణికుల భద్రత కోసం బీఎస్ 6 వాహనాలు
● జిల్లాకు కొత్తగా 25 బస్సులు
● పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టీమ్‌లు

ఆర్టీసీ ప్రయాణికుల సేవల కోసం మరిన్ని చర్యలు చేపట్టింది. సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా సంస్థ చేపడుతున్న చర్యలతో ఈ ప్రాంతంలో ఆర్టీసీకి ప్రయాణికుల ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది. ఇదే అదనుగా మరిన్ని సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది.



జిల్లాకు మంజూరైన బస్సులను ప్రారంభిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్:

ఆర్టీసీ అంటే ప్రయాణికుల్లో ఓ నమ్మకం. సురక్షిత ప్రయాణం ఆర్టీసీకే సొంతమన్న భావనతో పాటు ఓ భరోసా.. దీన్ని మరింత నిజం చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం మరిన్ని సేవలు అందుబాటులోకి తెచ్చారు. చౌకగా రవాణా సేవలు అందిస్తున్నారు. అందుకే ఆర్టీసీలో ప్రజా రవాణా సేవలకు ఆదరణ పెరుగుతుంది. దీనికి పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజా రవాణా సేవలే నిదర్శనం. మన్యం జిల్లాలో ఆర్టీసీ సేవలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థులకు సేవలందిస్తుంది. ఇదే సమయంలో చిల్లర సమస్యలకు చెక్ పెట్టేందుకు యూటీఎస్ టీమ్‌లు, విద్యార్థులకు రాయితీతో కూడిన బస్సు పాసులు, సరుకుల రవాణాకు కార్గో సేవలను విస్తరింపజేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఆర్టీసీ అధికారులు మరో ముందడుగు వేశారు. అధునాతన సాంకేతికతతో కూడిన బీఎస్ 6 బస్సులను తొలి విడతలో పార్వతీపురానికి 25 వాహనాలను మంజూరు చేశారు. ప్రయాణికుల భద్రత కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా మార్పులకు శ్రీకారం చుడుతున్నారు.

పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టిమ్‌లు

చిల్లర సమస్యకు చెక్ పెట్టేందుకు ఆర్టీసీలో నగదు రహిత ప్రయాణం చేసేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ చార్జీలు చెల్లించుకునే అవకాశాన్ని ఆర్టీసీ కల్పించింది. అందుకుగానూ జిల్లాలో పూర్తి స్థాయిలో 266 యూటీఎస్ టిమ్‌లు అందుబాటులో తీసుకువచ్చారు. బ్యాంకు ఖాతాలో డబ్బు ఉంటే చాలు యూపీఐ, డెబిట్ కార్డు, డిజిటర్ పేమెంట్లను అందుబాటులోకి తీసుకువచ్చి అటు ప్రయాణికులకు, ఇటు ఉద్యోగుల విధులకు ఆటంకం లేని పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం డిపోకు 82, పాలకొండ డిపోకు 79, సాలూరు డిపోకు 65 మొత్తం జిల్లాకు 266 యూటీఎస్ టిమ్‌లు కేటాయించారు. దీంతో ప్రయాణికులకు చిల్లర సమస్య తీరింది.

జిల్లాకు కేటాయించిన బీఎస్-6 బస్సులు

డిపో	అల్ట్రా పల్లె వెలుగు	పల్లె వెలుగు	ఎక్స్‌ప్రెస్‌లు
పార్వతీపురం	8	3	3
సాలూరు	4	1	-
పాలకొండ	-	4	2

పూర్తి స్థాయిలో సేవలు



ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధికి పెద్ద పీట వేస్తుంది. జిల్లాకు కొత్త బస్సులు కావాలని ప్రభుత్వానికి నివేదికలను అందజేశాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి సాంకేతికతతో కూడిన బీఎస్-6 వాహనాలను జిల్లాకు 25 బస్సులను మంజూరు చేసింది. విద్యార్థుల కోసం జిల్లాలో 8 ప్రత్యేక స్టూడెంట్ స్పెషల్ సర్వీసులు, 3205 ఉచిత బస్సు పాసులు, 9125 రాయితీ పాసులను అందించాం. చౌకగా రవాణా చేసుకునేందుకు కార్గో సేవలను అందుబాటులో తీసుకువచ్చాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి, పార్వతీపురం మన్యం

రాయపూర్ హైవే పనులను పరిశీలించిన కలెక్టర్

విజయనగరం అర్బన్: సబ్బవరం - రాయపూర్ మధ్య నిర్మాణంలో ఉన్న 130 సీడీ కొత్త జాతీయ రహదారిని కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం పరిశీలించారు. హైవేకి సంబంధించిన అంశాలను ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ రోహిత్ కుమార్, కలెక్టర్‌కు మ్యాప్‌ల ద్వారా వివరించారు. జాతీయ రహదారి జిల్లాలో సుమారు 75 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోందని చెప్పారు. పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని నిర్ణీత కాలవ్యవధిలో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. పనులు జరుగుతున్న తీరుపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. పర్యటనలో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

ఎప్పటిలాగే బైక్‌పై వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి తిరిగివస్తారనుకున్నారు.. కానీ రోడ్డు ప్రమాదం మృత్యువు రూపంలో వారిని కబళించింది. వారి కన్నతల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. భామిని మండలంలోని అత్తికొత్తూరు దగ్గరలో బైక్ బోల్తా పడిన దుర్ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. గ్రామస్తులను విషాదంలోకి నెట్టింది.

● మరొకరికి తీవ్రగాయాలు
● అత్తికొత్తూరు సమీపంలో విషాదం



కొడుకు మృతదేహం పట్టుకుని విలపిస్తున్న తల్లి సుజాత

భామిని: మండలంలోని అత్తికొత్తూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి ఆరిక రాకేష్(13), జీవన్(20) దుర్మరణం చెందారు. బిడ్డిక జీవన్, ఆరిక రోహిత్ అనే మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. తాటిమానుగూడకు చెందిన రాకేష్, జీవన్, రోహిత్‌తో కలిసి ఘనసర గ్రామం నుంచి తాటిమానుగూడ వైపు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి వారి బైక్ బోల్తా పడింది. దీంతో బైక్ నడుపుతున్న రాకేష్ రోడ్డును బలంగా తాకడంతో తీవ్రగాయాలపాలై, సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వైద్యసేవల కోసం క్షతగాత్రులను దగ్గరలోని కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జీవన్‌ను శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించగా, రోహిత్‌ను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ జీవన్ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుల్లో రాకేష్ శ్రీకాకుళం టీడబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కొడుకు మరణ వార్త విని, ఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికి అందివచ్చిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోయాడని విలపించారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు బత్తిలి ఎస్ఐ వై.అమ్మాన్‌రావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



తీవ్ర గాయాలతో జీవన్

న్యూస్‌రీల్

తప్పిన పెను ప్రమాదం



ఆయిల్ ట్యాంకర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మండలంలోని నక్కలపేట గ్రామానికి ఎదురుగా ఉన్న బ్రిడ్జి వద్ద శుక్రవారం హిరమండలం నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న హెచ్‌పీ ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పి వంతెనపై నుంచి పడిపోయింది. ఇక్కడ గతంలో ప్రమాదాలు జరిగి ఉండడంతో రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. ఇప్పుడు కూడా అదే ప్రదేశంలో ప్రమాదం జరిగింది. సాధారణంగా అక్కడ ఉపాధి వేతనదారులు పనులు చేస్తూ ఉంటారు. కానీ అదృష్టవశాత్తూ వారు పనులు ముగించుకుని వెళ్లాక బండి బోల్తా పడడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో వాహనం యజమానులు క్రేన్ ద్వారా ఆయిల్ ట్యాంకర్‌ను బయటకు తీశారు.

సమయపాలన పాటిస్తే గరిష్ట వేతనం



వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

సోంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతన దారులు సమయ పాలన పాటించి రోజుకు 6 గంటలు పని చేస్తే రూ.257 వేతనం అందుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవీ చిట్టిరాజు అన్నారు. సోంపేట మేజర్ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి హామీ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఏపీఓ ప్రమీల, ఈసీ శ్రీనివాసరావు, ఏపీడీ జయరాం, సిబ్బంది, వేతనదారులు ఉన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



అక్కుపల్లి శివసాగర్ తీరానికి చేరిన తాబేలు కళేబరం

వజ్రపుకొత్తూరు రూరల్: ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయి. వీటి కళేబరాలు అక్కుపల్లి శివసాగర్ తీరం, నువ్వలరేవు, చిన కొత్తూరు తీరాలకు చేరుతున్నాయి. తమ జాతి సంతతిని వృద్ధి చేసేందుకు తీరాలకు వస్తుంటాయి. అలాంటి సందర్భాల్లో వలలకు చిక్కుకుని చనిపోతున్నాయి. అరుదైన సముద్ర జీవులు మృత్యువాత పడుతున్న సంఘటనలు చూసి ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. సముద్ర జీవులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

'పౌష్టికాహారం అందించాల్సిందే'



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న గొండు సీతారాం, తదితరులు

ఆమదాలవలస: చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారం ఎట్టి పరిస్థితుల్లోనూ అందించాల్సిందేనని, ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో గల లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తీసుకువస్తుండడాన్ని గమనించి ప్రశ్నించారు. బడిలో భోజనం బాగులేదని చెప్పడంతో అక్షయ పాత్ర యాజమాన్యంతో అక్కడే మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా భోజనాలు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. మరోసారి జరిగితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు,ఐసీడీఎస్ పీఓ బాలామణి, సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎం. వాసుదేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని అంగూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం ఊడికలపాడుకు చెందిన పొన్నాన రాకేష్ గాయాలపాలయ్యాడు. చల్లవానిపేట నుంచి పాతపట్నంవైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపు తప్పి సమీపంలో ఉన్న కాలువలో పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన రాకేష్‌ను స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

మీరే స్ఫూర్తి.. మీదే కీర్తి

తప్పు చేస్తే పట్టుకోవడం ఖాకీల పని. ఆ తప్పు జరగకుండా చూసుకునే బాధ్యతను కూడా వారిప్పుడు నెత్తిన పెట్టుకున్నారు. దోషులను దండించడం లాఠీలకు తెలిసిన విద్య. దండనే కాదు ఆర్తులకు అండదండలు అందించే క్రతువును వారు మొదలుపెట్టారు. బంగారు బతుకులు చీకటిలోకి జారిపోకుండా చైతన్య కాగడాలు వెలిగిస్తున్నారు. యువత విష వలయంలో చిక్కుకుపోకుండా విషయాలను వివరించి చెబుతున్నారు. స్ఫూర్తి పోలీసు కళాబృందాలతో ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు.



శ్రీకాకుళం సబ్ డివిజన్ స్ఫూర్తి పోలీస్ ఇన్‌చార్జి ప్రవల్లిక ఆధ్వర్యంలోని కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మహిళల భద్రత - మా బాధ్యత పోస్టర్

- ఎస్పీ రాధిక ఆధ్వర్యంలో పోలీసుల వినూత్న కార్యక్రమాలు
- స్ఫూర్తి పోలీసు కళా బృందం పేరిట అవగాహన సదస్సుల నిర్వహణ
- విద్యాలయాల్లో చట్టాలు, సామాజిక అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం

శ్రీకాకుళం క్రైమ్: సారాయి బతుకులను మార్చడానికి ఆపరేషన్ 'పరివర్తన్(2.0).. విద్యార్థుల భాగస్వామ్యంతో నేరాల నియంత్రణకు క్యాంపస్ కాప్స్.. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా అబలలకు అండగా ఉండేందుకు స్ఫూర్తి పోలీసు కళా బృందాలు. ఎస్పీ జీఆర్ రాధిక వినూత్న ఆలోచనలతో విశిష్ట కార్యక్రమాలకు ఊపిరి పోస్తున్నారు. అవగాహన లేమితో అనవసర విషయాల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకుంటున్న వారి కోసం పోలీసులతోనే విజ్ఞాన ప్రదర్శనలు నాటికల రూపంలో ప్రదర్శిస్తున్నారు. ఇందుకోసం జిల్లాలోని మూడు సబ్ డివిజన్లకు ముగ్గురు మహిళా ఎస్‌ఐలను ఇన్‌చార్జిలుగా పెట్టి వీరిని మానిటరింగ్ చేసేలా డీఎస్పీ స్థాయి వ్యక్తిని జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు.

బృందం ఇలా..

- ఒక్కో డివిజన్‌కు ఉత్సాహవంతులైన తొమ్మిది మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేసి స్ఫూర్తి పోలీసు కళా బృందంగా తయారు చేశారు.
- వీరు ముందే కొన్ని స్కిట్‌లను ఎంపిక చేసుకుని ఉంటారు.
- ఉదయం పూట కళాశాలలు, పాఠశాలల్లో యాంటీ ర్యాగింగ్ పేరిట ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు అవగాహన పరుస్తూనే.. సాయంత్రం, రాత్రి సమయాల్లో రెండు గ్రామాలను లేదా నేరప్రాంతాలను, ముఖ్య కూడళ్లను, వార్డులను, వీధుల ఎంపిక చేసుకుని అక్కడి మహిళలకు, బాల బాలికల తల్లిదండ్రులకు ఆరు అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు.
- శ్రీకాకుళం దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్ తన పర్యవేక్షణలో జిల్లాలోని మూడు సబ్ డివిజన్లకు (శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ) మహిళా ఎస్‌ఐలైన ప్రవల్లిక, లక్ష్మి, చంద్రకళలను ఇన్‌చార్జిలుగా నియమించారు.
- ఈ బృందాలకు గత నెలన్నర రోజులుగా డీపీవో, పీఆర్వో, క్లూస్ టీం ఎస్‌ఐల సమక్షంలో శిక్షణ ఇప్పించి సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

వీటిపైనే అవగాహన

మహిళల రక్షణకు గల చట్టాలు (పోక్సో, దిశ), గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్మార్ట్ ఫోన్ తదితర సోషల్ మీడియాకు బానిస కావడం వల్ల కలిగే దుష్ప్రభావం, మాదకద్రవ్యాలు, ఆల్కహాల్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాలు చేసుకుంటే బాలికలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు- కలిగే నష్టాలు, మోసపూరిత పరిచయాలు, తద్వారా ప్రేమ ద్వారా కలిగే దుష్పరిణామాలు, ప్రస్తుత కాలంలో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం- వ్యవహరించాల్సిన తీరు వంటివాటిపై నాటికలు ప్రదర్శిస్తారు.

మూడు రకాల స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం





పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోతే వారి తప్పుడు నడత, అమ్మాయిలు అబ్బాయి ల మాయమాటలు నమ్మి మోసపోయిన తీరు, బర్త్‌డే పార్టీకి ఫ్రెండ్స్‌తో సరదాగా వెళ్లి అక్కడ మత్తు పానీయాలు తాగి స్పృహ కోల్పోతే వారిపై అఘాయిత్యం ఎలా చేస్తారన్నది కళ్లకు కట్టినట్లు స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం. ఎస్పీ ఆదేశాలతో 15 రోజుల పాటు నాటక ప్రదర్శనలకు శిక్షణ పొందాం. ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని చెబుతున్నాం. – ఎ.చంద్రకళ, కె.లక్ష్మి, ఎం.ప్రవల్లిక, కాశీబుగ్గ, టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల స్ఫూర్తి ఇన్‌చార్జులు

బాలికలు, మహిళల భద్రతే ధ్యేయం



స్ఫూర్తి పోలీస్ కళా బృందంలో 10 మంది ఉంటారు. నా పరిధిలో శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్‌లు ఉన్నాయి. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో నెలలో రెండు రోజుల పాటు కార్యక్రమాలు జరగాలి. ఉదయం పూట ఐదు కళాశాలలు, పాఠశాలలు, సాయంత్రం, రాత్రి పూట రెండు గ్రామాల్లో ఈ ప్రదర్శనలు చేయాలి. మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరుగుతుంది. – జీఆర్ రాధిక, ఎస్పీ

పోక్సో కేసులు ఆలోచింపజేశాయి



18 ఏళ్లలోపు మైనరు బాలికను ఆమె ఇష్టంతో ప్రేమించినా అది పోక్సో చట్టం ప్రకారం చెల్లదు. పెళ్లి చేసుకుందామన్నా కుదరదు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే వారి పని జైలే. తక్కువ వయసులో వారే ఇలాంటి నేరాల్లో ఉండటం, అమ్మాయిలు బలైపోతుండటం విచారకరం. ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారానైనా ఫలితం ఉంటుందని మా ఎస్పీ ఆలోచన. – డి.వాసుదేవరావు, స్ఫూర్తి పోలీస్ జిల్లా ఇన్‌చార్జి (శ్రీకాకుళం దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ)

గతంలో కంటే భిన్నంగా ఉంది



గతంలో దిశ డీఎస్పీగా లలిత కుమారి ఉండేటప్పుడు పోలీస్ నేషనల్ జెండర్ క్యాంపైన్ నెలరోజుల పాటు లాయర్లు, డాక్టర్లు, మేధావుల సమక్షంలో నిర్వహించాం. దానికంటే భిన్నంగా స్ఫూర్తి పోలీసు కార్యక్రమం ప్రస్తుత రోజులకు అనుగుణంగా ఉంది. అమ్మాయిలు ఏ విషయాన్ని లోపల ఉంచుకోకుండా నిర్భయంగా చెప్పగలిగే ధైర్యాన్ని పోలీసు శాఖ ఇచ్చారు. కార్యక్రమాన్ని రూపకల్పన చేసింది ఓ మహిళా ఎస్పీ అన్నది అమ్మాయిలు గుర్తుంచుకోవాలి. – డాక్టర్ ఆర్.ప్రమీల, మహిళా సాధికారిత కమిటీ కోఆర్డినేటర్, ఆర్ట్స్ కళాశాల

నూతన గవర్నర్‌తో..





రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రులు ధర్మాన ప్రసాద రావు, సీదిరి అప్పలరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలి క్రీడాకారులు



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన టెక్కలి క్రీడాకారులు

టెక్కలి: ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలిలో శాప్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ ఎన్.శేఖర్ శుక్రవారం తెలిపారు. బాలుర కేడెట్ విభాగంలో 38 కేజీల కేటగిరిలో పి.రాకేష్‌వర్మ, 34 కేజీల కేటగిరిలో ఎస్.లిఖిత్ ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులను కోచ్‌లు సురేష్, జగదీష్, బి.నారాయణరావు అభినందించారు.

విజయదుర్గకు విశేష పూజలు



శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం కల్చరల్

బంగారం, వెండి ఆభరణాలు చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం పట్టణంలోని గుజరాతీపేట సమీపంలో పొందరవీధిలో (నాయుడు గట్టు చెరువు దరి) గురువారం రాత్రి చోరీ జరిగిందని రెండో పట్టణ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు. పొందరవీధిలో నివాసముంటున్న దున్న మంగ భర్త చనిపోవడంతో కొంతకాలంగా ఫంక్షన్లలో కూరగాయలు కోస్తూ, వంటలు చేస్తూ రేకులషెడ్డు ఇంటిలో జీవనం సాగిస్తోంది. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే కాలనీలో తన సోదరి కూడా ఉంటోంది. ఈ నెల 22న ఇంటికి తాళం వేసి మంగ పొందూరు వెళ్లింది. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు సోదరి మంగ ఇంటికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉండటం చూసి చోరీ జరిగిన విషయం మంగకు ఫోన్‌లో చెప్పింది. మంచం పరుపు కింద ఉంచిన తాళాల సాయంతో బీరువాలో భద్రపరిచిన మూడు తులాల బంగారం (చెవి రింగులు, ఉంగరాలు), 60 తులాల వెండి (గ్లాసులు, కాళ్ల పట్టీలు,



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

చిన్న చిన్న వస్తువులు) పోయినట్లు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మహేంద్ర మాతే, ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ లక్ష్మి, క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.5.37 లక్షలు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లి ఆలయం హుండీ లెక్కింపు శుక్రవారం చేపట్టారు. పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి కార్యనిర్వహనాధికారి టి. వాసుదేవరావు పర్యవేక్షణలో 82 రోజులకు గాను లెక్కింపు చేపట్టగా రూ. 5,37,807 ఆదాయం సమకూరినట్లు ఈఓ వి.వి.సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ప్రత్యేక ఆహ్వానితులు బాడాన గోవిందరావు, అర్చకులు కె.అప్పలరాజు, మాధవరెడ్డి పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

విత్తనాల సాగుతో భూసారం

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు పంట పొలాల్లో 30 రకాల విత్తనాల సాగుతో భూసారం పెరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి అన్నారు. శుక్రవారం ముద్దాడ గ్రామంలో 'నవధాన్యాల సాగు-నేల తల్లి బాగు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పంట సాగుకు ముందు అపరాలు, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, నూనె గింజలు వంటి విత్తనాలు వేసి 40 రోజుల అనంతరం పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించాలని సూచించారు. భూమిని 365 రోజులూ కప్పి ఉంచితే సారం పెరుగుతుందన్నారు. ప్రధాన పంటల మధ్య నవధాన్యాలు సాగు చేయడం శ్రేయస్కరమని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ధనలక్ష్మి, అప్పలనర్సయ్య, పోలీస్ పాల్గొన్నారు.



ముద్దాడలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ర్యాలీ

ప్రయోగాలకు వేళాయె!



శ్రీకాకుళంలోని ఓ కళాశాలలో సిద్ధమైన ప్రాక్టికల్ ల్యాబ్

- రేపటి నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్
- నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్షల నిర్వహణ
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 134 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ప్రాక్టికల్స్‌పై సైన్స్ లెక్చరర్లకు సూచనలిస్తున్న ఆర్ఐఓ, ఇతర అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న ప్రాక్టికల్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు నేతృత్వంలోని డీఈసీ కమిటీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే కళాశాలల్లో ల్యాబ్‌లను శుభ్రం చేసి విద్యార్థులను ప్రాక్టికల్స్‌కు సన్నద్ధం చేశారు.

నాన్ జంబ్లింగ్ విధానంలో..

మార్చి 7తో ముగియనున్న ప్రాక్టికల్స్‌ను పారదర్శకంగా పూర్తిచేసేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఒకేషనల్ విద్యార్థులకు 20వ తేదీనే ప్రారంభమయ్యాయి. సైన్స్ విద్యార్థులకు మాత్రం ఆదివారం నుంచి ప్రాక్టికల్స్ మొదలవుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలే కేటాయించారు. మొదటి స్పెల్‌లో 81 కేంద్రాలు, రెండో స్పెల్‌లో 74 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు వాటిని కమిషనరేట్, జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ చేశారు.

19,471 మంది సన్నద్ధం..

జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలకు 19471 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూపు నుంచి 13165 మంది, బైపీసీ గ్రూపు నుంచి 6306 మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎగ్జామినర్లు, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తిచేశారు. పరీక్ష కేంద్రాలకు బుక్‌లెట్స్‌తోపాటు నామినల్ రోల్స్, ఫొటో నామినల్ రోల్స్ ఇతర పరీక్ష మెటీరియల్స్‌ను చేరవేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షలపై అధికారులు నిఘాపెట్టారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు డీఈసీ కమిటీ సభ్యులు ఆర్.భూషణరావు (ప్రిన్సిపాల్-జీజేసీ బూర్జ), పీవీఎల్ నారాయణరావు (ప్రిన్సిపాల్-జీజేసీ ఎచ్చెర్ల), డి.ఫల్గుణరావు (జేఎల్- జీజేసీ పొందూరు), హైపవర్ కమిటీ కె.అప్పలరాజు (ప్రిన్సిపాల్-జీజేసీ కంచిలి) సభ్యులు, బోర్డు అధికారులు తనిఖీలు చేరపనున్నారు.

పది రోజుల్లోనే పూర్తిచేసేలా..

రాష్ట్రంతోపాటు జిల్లాలోను గతంలో 20 రోజుల పాటు నిర్విరామంగా ప్రాక్టికల్స్ నిర్వహించేవారు. నాలుగు విడతలుగా చేసి, స్పెల్‌కు ఐదు రోజులు చొప్పున కేటాయించేవారు. ఈ ఏడాది రెండు స్పెల్స్‌ను పది రోజుల్లోనే పూర్తిచేసేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంది.

ఏర్పాట్లు పూర్తిచేశాం..



సైన్స్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. వాస్తవానికి ఫిబ్రవరి 20 నుంచే ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు మొదలయ్యాయి. మార్చి 7 వరకు ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలో సీసీ కెమెరాల నిఘాలో స్ట్రీమింగ్ విధానంతో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. – ఎస్.తవిటినాయుడు, జిల్లా ఆర్ఐఓ శ్రీకాకుళం

మాస్టారు అడిగారంటూ..

- పాఠశాలల పక్క ఇళ్లే టార్గెట్
- మాస్టారు పేరు చెప్పి డబ్బులు తీసుకుంటున్న వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



జీరుపాలెం హైస్కూల్

రణస్థలం:

ఈ నెల 13వ తేదీ. ఉదయం ఏడు గంటలు. జీరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న దుమ్ము సీతమ్మ భర్త గోపి ఇంటికి గుర్తు తెలియని వ్యక్తి వెళ్లాడు. పక్కనే ఉన్న స్కూల్ హెచ్ఎం అర్జెంటుగా రూ.10వేలు అడిగారంటూ తీసుకున్నారు.

ఈ నెల 24వ తేదీన తెప్పలవలస పంచాయతీ నీలంపేట ఎంపీయూపీ పాఠశాల పక్కన యాగాటి సోము అప్పయ్యమ్మ అనే వృద్ధురాలి ఇంటికి ఉదయం ఏడింటికి ఎవరో వెళ్లారు. హెచ్ఎం నూకరాజు అర్జెంటుగా రూ.10వేలు ఇమ్మన్నారమ్మా.. అని చెప్పగా.. ఆ వృద్ధురాలు తడబడి తన వద్ద లేవని చెప్పారు. అయినా చుట్టుపక్కల వారి పేర్లు చెప్పి రూ.5వేలు తీసుకున్నారు. ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడించి మరో రూ.3వేలు లాగేశారు.

అదే రోజు 8 గంటల సమయంలో కృష్ణాపురం పంచాయతీ గోసాంలో వెలుగు సీఏగా పనిచేస్తున్న బన ఎల్లమ్మతోనూ హెచ్ఎం అడిగారని చెప్పి రూ.10వేలు తీసుకున్నారు.



నిజానికి ప్రధానోపాధ్యాయులు డబ్బులు తీసుకురావాలని ఎవరినీ పంపించలేదు. వారి పేర్లు చెప్పి ఎవరో దుండగులు తెల్ల రంగు స్కూటర్‌పై తెలుపు రంగు దుస్తులు వేసుకుని వచ్చి టోపీ వేశారు. 13వ తేదీనే సీతమ్మకు హెచ్ఎం ఎదురుపడగా.. ఇలా ఎవరో డబ్బులు తీసుకున్న మాట చెప్పారు. దీంతో ఆయన ఆశ్చర్యపోయి తానేమీ డబ్బులు అడగలేదని చెప్పే సరికి ఆమెకు మతిపోయింది. మిగతా రెండు ఘటనల గురించి తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు.. తమకు ఎలాంటి సంబంధం లేదని గ్రామాల్లో తమ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వవద్దని కోరుతున్నారు. సోము అప్పయ్యమ్మ మాట్లాడుతూ ఎవరో వచ్చి మాస్టారు నూకరాజు పేరు చెప్పి డబ్బులు తీసుకున్నారని, టీచర్ పేరు చెప్పి బాగా ప్రాధేయపడడంతో పింఛన్ డబ్బులు ఇచ్చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ త్రినాథ రావు స్పందిస్తూ టీచర్ల పేర్లు చెప్పి డబ్బులు దోచుకున్న మాట వాస్తవమేనని అన్నారు. ఇలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

మోసపోవద్దు

టీచర్ల పేర్లు చెప్పి అమాయకులను మోసం చేయడం దారుణం. ఇలాంటి వ్యక్తుల వలలో పడవద్దు. ఈ విషయమై మాకు ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదులు రాలేదు. గుర్తు తెలియని వ్యక్తులు వస్తే పోలీసులకు గానీ, గ్రామ పెద్దలకు గానీ, 100కైనా సమాచారం ఇవ్వాలి. – జి.రాజేష్, జేఆర్ పురం ఎస్ఐ



నీలంపేట పాఠశాల